గోదారమ్మ-22 (ఆఖరి భాగం)

గోదారమ్మ గబగబా వెంటనే అంది ‘‘సీతా... నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు. నా అభిప్రాయం ఏమిటో నువ్వు పూర్తిగా విననేలేదు” అంది.

సీత ఇంకా ఆ బాధ నుండి తేరుకోలేనట్లుగా, బేలగా ఏమిటన్నట్లుగా చూసింది.

గోదారమ్మ మళ్ళీ చెప్పటం మొదలుపెట్టింది.

‘‘సీతా... ఈ వూళ్ళో... మీ ఇంట్లో నిశ్చింతగా స్థిరపడ్డాక... అలా నాలుగు వీధులూ తిరుగుతూ, రోజూ కాసేపు గుడి ప్రాంగణంలో కూర్చునేదానిని కదా... అపుడు అక్కడకు తన అన్నకూతురు కుముదను తీసుకుని రామచంద్ర వస్తూ ఉండేవాడు. కుముద పాటలు విని నేను తన్మయురాలినైపోయేదానిని. తనతోనూ, రామచంద్రతోనూ అలా పరిచయం పెరిగింది. వాళ్ళింటి విషయాలన్నీ తెలిసాక... అతడే మా ఇంటినుండి డబ్బుతో పరారైన వ్యక్తి కొడుకని గ్రహించాను.

పరిచయం పెరిగాక అతనే వాళ్ళింటి వివరాలన్నీ నాకు చెప్పుకొచ్చాడు.

‘‘అమ్మా... మీ పట్ల నాకు గౌరవం, ప్రేమాభిమానాలు కలిగాయి. మీ గురించి నాకు పూర్తిగా తెలియకపోయినా, ఈ వూళ్ళో ఉద్యోగం చేసే సీత అనే అమ్మాయికి పెద్దమ్మగారనే విషయం మాత్రమే తెలుసు. అయినా మా ఇంటి విషయాలు మీరడిగారని కాదుగానీ, మీ పట్ల ఏర్పడిన గౌరవభావంతో చెప్పుకోవాలనిపించి చెబుతున్నాను.

అమ్మ చనిపోయాక, నాన్న దూరంగా ఉద్యోగానికని వెళ్ళారు. నేను, మా అన్నా వదినల దగ్గిరే ఈ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తూ ఉన్నాను. ఒకరోజు నాన్నగారు వచ్చారు. ‘ఎన్నాళ్ళు ఉద్యోగం చేసినా జీవితంలో అభివృద్ధి ఏముంది... ఇదే గొర్రెతోక బెత్తెడు అన్న విధంగానే ఉండటమేనా?’ అనే మనసు వేధింపులు తట్టుకోలేక ఇక ఆ వూళ్ళో ఉద్యోగం మానేద్దామనుకుంటున్నా అని చెప్పారు. ‘మరేం చేస్తారు...?’ అన్న ప్రశ్నకి ‘వ్యాపారం చేయాలని ఉందనీ, దానికి తగ్గ పెట్టుబడికి సరిపడా డబ్బును సంపాదించుకుని వచ్చాననీ..... ఇక ఏ వ్యాపారం చెయ్యాలా అనే దాని గురించి ఆలోచనలు చేస్తున్నానని’ చెప్పారు. ఆ విషయం పట్ల అప్పట్లో నేనేమంత ఆసక్తి చూపించలేదు. విని వూరుకున్నాను.

అయితే, అంతలోనే ఒక ఘోరం జరిగిపోయింది. అన్నా వదినా ఒక్కసారే యాక్సిడెంట్ లో ప్రాణాలు పోగొట్టుకోవటం జరిగింది.

ఆ సంఘటనతో నాన్నలో చాలా మార్పు వచ్చింది. 'తను చేసిన తప్పే వాళ్ళకి శిక్షగా మారిందంటూ' కుమిలిపోయారు. నాకు అర్థం కాలేదు. అంతవరకూ నాన్న తను ఉద్యోగం చేస్తున్నవాళ్ళ దగ్గర్నుండి, వాళ్ళకి తెలియకుండా డబ్బు తీసుకువచ్చేసారనే నాకు తెలియదు. 'చేసిన పాపం చెబితే పోతుందంటారంటూ' వివరం చెప్పేసరికి నేను విస్తుపోయాను. వ్యాపారం చేసే ఉద్యేశ్యంతో అప్పటివరకూ ఆదా చేసిన డబ్బుతో వచ్చి ఉంటారనీ, అందుకే ఉద్యోగం మానేసి వుంటారనే అపోహలో నేనున్నాను.

కానీ ఆ అపరాధ భావంతో నాన్న ఆరోగ్యం క్షీణించి మంచం పట్టారు. నాన్నచేసిన తప్పును సరిచేస్తానంటూ నాన్నకి చెప్పి, ఆ డబ్బును వాళ్ళింటికి తీసుకుని వెళ్ళి 'మా నాన్న ఎపుడో అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి ఇమ్మన్నారంటూ' డబ్బును వాళ్ళబ్బాయికి అప్పచెప్పి , మిగతా వివరాలేం చెప్పకుండా వెంటనే తిరిగి వచ్చేసాను.

ఈ విషయం చెప్పగానే నాన్న మొహంలోకి చిన్న చిరునవ్వు వచ్చింది. నిశ్చింతగా అనిపించారు. అయితే ఆ రాత్రే గుండెపోటుతో నాన్న మరణించారు. ఇక కుముద బాధ్యత నాదే అయింది...!' అంటూ రామచంద్ర జరిగిన విషయం అంతా వివరంగా చెప్పేసరికి నాకు మొత్తం అర్థమైంది. కానీ వాళ్ళ నాన్నకి ఉద్యోగం ఇచ్చి, ఆదుకున్న వ్యక్తి భార్యను నేనేననే విషయం రామచంద్రకి చెప్పలేదు. అనవసరమనిపించింది.

ఈ వివరంతో రామచంద్రం ఎంత గొప్ప మనిషో నాకు అర్థమైంది.

తండ్రి తెచ్చిన డబ్బుకు ఆశపడకుండా అతని అపరాధభావనను రూపుమాపటానికి రామచంద్ర చేసిన పని నాకు చాలా గొప్పగా అనిపించింది! అతనెంత మంచి వ్యక్తో గ్రహించాను కాబట్టే... నీకు సరిజోడీ అవుతాడని నిర్ణయించుకున్నాను. నీ పట్ల అతనికి గల ఇష్టాన్ని గ్రహించాకే నా నిర్ణయం మరీ బలపడింది!

ఇపుడు చెప్పు సీతా... రామచంద్ర పట్ల నాకేర్పడిన అభిప్రాయం సరైనదేనని నీకు అనిపించటంలేదూ...? అంత గొప్ప మనసున్న మనిషి కాబట్టే రంగాకి నువ్వు కన్నతల్లివనే నమ్మికూడా నిన్ను పెళ్ళిచేసుకోవటానికి ముందుకు వచ్చాడు! అవును కదా...?''

సీత ఏం మాట్లాడలేకపోయింది. మౌనంగా అంగీకరిస్తున్నట్లుగా తలవూపింది. రామచంద్ర పట్ల తను పొరబడ్డాననే భావంతో కాబోలు, కొంచెంగా తల వంచుకుంది.

''సీతా... నేను వదిలేసిన ఊరు, మనుష్యుల పేర్లు చెప్పకుండా, నా జీవితం గురించి మాత్రం మునుపు కొంతకొంతగానూ, ఇపుడు పూర్తిగానూ చెప్పేసాను! ఇదో కొత్తజీవితం కాబట్టి ఆ పేర్లు అనవసరమనుకుని అవేమీ చెప్పలేదు!'' అంటూ ముగించిందావిడ.

సీత వెంటనే ఆవిడ చేతులు పట్టుకుని ఆప్యాయంగా " మీరు ఈ ఊరు రావటం...నా ఇంటిలో ఉండటం చూస్తే...మనిద్దరికీ పూర్వ జన్మ ఋణానుబంధం ఏదో ఉండేవుంటుందని గాఢంగా అనిపిస్తుందమ్మా " అంది.

గోదారమ్మ గలగలా నవ్వేసింది.

* * *

ఆ తరువాత కొన్నాళ్ళకే... ఊరివాళ్ళంతా కలిసి తమ శ్రమదానం, విరాళాలతో నిర్మించుకున్న వంతెన ప్రారంభోత్సవం పెట్టుకున్నారు. కానీ అందరూ ఒకే మాట మీద, ఆ వంతెన ప్రారంభం ప్రముఖ వ్యక్తులతో కాకుండా గోదారమ్మ గారి చేతులమీదే జరగాలని కోరుకున్నారు. ఎక్కువ మొత్తం విరాళంగా ఇవ్వటమే కాకుండా, ఆ ఆలోచన చేసి, ఊరందరినీ ఒకే తాటి మీద నడిపించటానికి స్ఫూర్తినిచ్చిన, గోదారమ్మగారి పేరే ఆ వంతెనకూ పెట్టాలని ఊరువాళ్ళంతా అనుకున్నారు. ఆవిడ అభ్యంతరం చెప్పినా వాళ్ళు వినలేదు.

''ఇది ప్రారంభించిన రోజునుండే 'గోదారమ్మ వంతెన' అనే అంటున్నాం. ఇక ప్రత్యేకించి పేరు పెట్టేదేం లేదు లెండి...'' అనేసరికి ఆవిడా మౌనంగా ఉండిపోయింది. కానీ, రిబ్బన్ కటింగ్ అంటూ హడావుడి చేసేసరికి గోదారమ్మ తను చేయటానికి ఒప్పుకోక, శ్రమదానం చేసిన ఒక పేద రైతుతో చేయించేసరికి అందరూ హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు. అన్ని పేపరు వాళ్ళు, 'ఒక మనిషి కృషి...ఒక వూరు విజయం' గా మారిన తీరు, గోదారమ్మ గారి నిస్వార్ధమైన సేవా నిరతినీ, కృషినీ ప్రశంసిస్తూ, ప్రత్యేక కధనాలు రాసారు.

ఆ రోజుతో వాళ్ళు అనుకున్న పని అలా నిర్విఘ్నంగా పూర్తయేసరికి ఊరు వాళ్ళందరితో పాటు గోదారమ్మా, సీతా వాళ్ళు కూడా సంతృప్తిగా, ఆనందంగా భావించారు.

* * *

కొన్ని రోజుల తర్వాత....

లోపల కూర్చున్న గోదారమ్మ దగ్గరకు వచ్చిన సీత ఒక పేపరు కటింగ్ ను ఆవిడకు చూపించింది.

బాగా దూరాలకు కూడా వెళ్ళే ఆ వార్తా పత్రికలో ఒక చోట ఈ 'గోదారమ్మ వంతెన' ప్రారంభం గురించిన వార్త ప్రముఖంగా ప్రచురింపబడింది.

అది చూపించి సీత ఆవిడతో చెప్పింది... ''ఈ పేపరు కటింగ్ చూపించి, ఇందులోని చిత్రంలో ఉన్నమిమ్మల్ని చూపిస్తూ 'గోదారమ్మగారు ఈ ఇంట్లోనే ఉంటున్నారుగా' అనడుగుతూ, మిమ్మల్ని కలుసుకోవాలంటూ ఎవరో వచ్చారమ్మా''

దానికావిడ 'ఎవరూ' అంటూ బయటకు వచ్చి అతన్ని చూసి ''బాబూ నువ్వా...' అంది అప్రయత్నంగా.

''అమ్మా'' అంటూ అతను ఆదరంగా దగ్గరకు వచ్చి ''నీ పేరు గోదారమ్మ అని వేసారేంటమ్మా... 'నాకోసం వెతకవద్దు... స్వేఛగా బ్రతకాలని వెళ్ళిపోతున్నా' , అని ఉన్న నీ ఉత్తరం చూసి నాకు మతిపోయింది. నీకోసం వెతకని వూరు లేదు. మన తాతగారి ఇంటికి వెళ్ళివుంటావేమోననుకుంటూ ఆ ఊరికీ వెళ్ళాం... కానీ ఎవరూ నీ ఆచూకీ చెప్పలేకపోయారు.....! నువ్వక్కడకు రానే లేదన్నారు. ఈ పేపరు కటింగ్ లో నిన్ను చూసి 'నువ్వా..కాదా' అన్న అనుమానంతో వెంటనే బయలుదేరి వచ్చేసాను. అమ్మా...నువ్వింతకీ ఎందుకు ఈ వూరు వచ్చినట్లూ..?" అని గబగబా ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఆ మాటలు వింటూనే సీత ఆ వచ్చినతను గోదారమ్మ పెద్ద కొడుకని గ్రహించి ఉత్సుకతతో వాళ్ళని పరికించి చూసింది.

గోదారమ్మ మాత్రం అతని ప్రశ్నలకు చిన్నగా నిట్టూర్చింది.

''ఇది నాకు నచ్చిన పేరు... అంతేకాదు, ఈ వూళ్లో చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నాను. స్వేచ్చగా బ్రతకటమే కాదు...ఈ వూరుకీ, ఈ వూరి జనాలకీ నేనేదో ఋణపడి వుంటాను. ఈ ఊరికి నా అవసరం చాలా ఉందని నేను అనుకునేలా చేసిందీ వూరు. అలా అనుకోకుండా వూరందరి అభిమానం కూడా పొందగలిగాను.'' అంది నిదానంగా గోదారమ్మ.

అతను ఆశ్చర్యపోతూ '' అది సరేకానీ అమ్మా....నువ్వు ఒక్కదానివీ ఇలా వూరు కాని వూరు వచ్చేసి ఉండిపోయావా..? ఎంతైనా ఇలా వూరందరి అభిమానాన్నీ పొందగలగటం....ఒక వూరి బాగు కోసం నువ్వు ఒంటరిగా శ్రమించిన తీరూ.... నువ్వు సంపాదించిన పేరూ చూస్తుంటే...నాకు చాలా గర్వంగా ఉందమ్మా. కానీ మమ్మల్ని క్షమించి, నువ్వు మళ్ళీ తిరిగి రావటం మా అందరికీ చాలా సంతోషంగా ఉంటుందమ్మా. తమ్ముడుకూడా నీ రాక కోసం ఎదురుచూస్తున్నాడు...''

ఆ మాటలకు ఆవిడ చిరునవ్వు నవ్వింది.

ఇంతలో, అతని వెనక నిలబడినామె, కోడలయి ఉండొచ్చని సీత అనుకుంది...ఆమె కొంచెం ముందుకు వచ్చి గోదారమ్మ చేతులు పట్టుకుంది.

''మీరు మీ ఇంటికి వచ్చెయ్యండి. ఏమైనా తప్పులు జరిగివుంటే మన్నించండి.. మీరు ఇల్లు వదిలి వెళ్ళిపోయాకే మీ విలువ నాకు తెలిసి వచ్చింది. మా తమ్ముడు, పెళ్ళి అవగానే ఇక మా అమ్మా నాన్నల అవసరం తీరినట్టు దూరం పెట్టాడు. అప్పుడు గానీ నేను చేసిన తప్పేమిటో నాకర్ధం కాలేదు. రోజు ఈయన వేదన

చూస్తూన్నాను...మీకూ మీ పిల్లలకూ ఉన్న అనుబంధం...అన్నా తమ్ముళ్ళ మధ్య అనురాగం చూసాక, నేను చాలా పశ్చాత్తాపడ్డాను....అంతేకాదు, మాకు పుట్టబోయే పిల్లలు కూడా అలాంటి విలువలతోనే...మీ చేతుల్లోనే పెరగాలి. దయచేసి నా అజ్ఞానాన్ని మన్నించి మళ్ళీ మన ఇంటికి వచ్చేయండి.." అంది కన్నీళ్ళతో.

ఆ మాటలు వింటూనే రాగిణి ని హత్తుకున్న గోదారమ్మ...కొడుకును కూడా దగ్గరకు తీసుకుంది.

''ఇక్కడా నాకు ఇద్దరు పిల్లలు, ఇద్దరు మనవలూ ఉన్నారు. ఈ వూరివాళ్ళు నన్ను తమ పెద్దగా, ఆప్తురాలిగా భావించి గౌరవిస్తున్నారు. ఇది నేను కోరుకున్న జీవితం. ఎక్కడైతేనేం... ఆనందంగా, ప్రశాంతంగా నాకు నచ్చిన, చేయగలిగిన పని స్వేచ్ఛగా చేయాలనుకుని బయటకి వచ్చానే తప్ప, మీ మీద కోపంతో కాదు. తప్పకుండా త్వరలో మీరు మనవలతో బిజీ అయ్యాక అక్కడికి వస్తాను. నా శేషజీవితం ఇక పిల్లలకే అంకితం, వాళ్ళు మీ పిల్లలైనా, చిన్నాడి పిల్లలైనా...సీత పిల్లలైనా.." మురిపెంగా అంటూనే సీతని వాళ్ళకి పరిచయం చేసింది.

''చివరగా ఒకమాట. ఈ మధ్య నేను ఎక్కడో గౌతమ మహర్షి గురించి చదివాను. 'అవసరానికి మించిన సంపద, ఆడంబరం, ఆయన జీవితంలో లేవు. సమానత్వ భావనే ఉండేది! జ్ఞానం పెరిగేకొద్దీ 'నాది' అనే భావన తగ్గి 'మనది' అనే భావన బలపడాలి !' నాకూ అదే మంచి మార్గంగా తోచింది.

తప్పుచేసిన వారిని శాశ్వతంగా తిరస్కరించకుండా, మార్పునకు అవకాశం ఇవ్వగలగాలనే సందేశం నేను నేర్చుకున్నాను. 'జీవితం అనేది మంచి విలువలను నేర్చుకుని, ఇతరులకూ నేర్పే ప్రయాణమని' నమ్మతూ అలాగే జీవించాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతవరకూ సాధించగలనో చెప్పలేనుగానీ నలుగురిలో ఒకరిగా ఉంటూ, ఆ నలుగురి హితం కోరి ఏమైనా చేయగలగాలనేది మాత్రమే నా లక్ష్యంగా, ఈ చివరి రోజులను గడుపుతాను! నా గురించి మీరు దిగులు పడాల్సిన పనే లేదు. నా అన్ని అవసరాలనూ ఈ సీత - రామచంద్ర ఎప్పుడూ కనిపెట్టుకునే వుంటారు... '' మళ్ళీ అంది గోదారమ్మ సంతోషంగా.

గోదారమ్మ మాటలకు గుండెల్లో పొంగివచ్చిన ఆనందాన్ని కళ్ళల్లో చూపిస్తూ సీత ఆప్యాయంగా ఆవిడ చేతులను పట్టుకుని ''అమ్మా... మీరు మా ఇంటికి రావటం, మీలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని దగ్గరగా చూడగలగటం... నా అదృష్టం.'' అంది ఆర్తిగా.

వెంటనే రాగిణి ఆనందంగా..." అవును సీతా, నువ్వూ అత్తమ్మతో పాటూ...మా ఆడపడుచుగా, ఇంటికి రావాలి. ఆడపిల్లలు లేని లోటు అత్తమ్మకు మన ముగ్గురం కలిసి తీరుద్దాం." అంది మనస్ఫూర్తిగా.

ఆనందంగా అందరూ గోదారమ్మను చుట్టుముట్టారు. వాళ్ళందరినీ హత్తుకున్న గోదారమ్మ మనసు ఆ నిండు గోదారిలా, ఆనందాతిశయంతో పొంగిపోయింది.

'జగమంత కుటుంబం నాది....ఏకాకి జీవితం నాది....' ఎక్కడినుండో పాట తేలి వస్తూ, గోదారమ్మ గారి ఆంతరంగానికి అద్దం పట్టింది.

*** సమాప్తం ***